క్లుప్తంగా

ఉత్సాహంగా ఆటల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వినాయక్‌నగర్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.శనివారం అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను వినాయకనగర్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి పర్యవేక్షించారు. దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో రోడ్డులో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగాయి. చిన్నారులు భక్తి గీతాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కళాకారులను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతి సంస్థలు కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మీనాక్షి కల్చరల్ ఆర్ట్స్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, సినీ సంగీత విభావరి, విద్యావేత్త మధుమోహన్‌కు అభినందన సభ నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులు సేవలు జాతికి అవసరమని తెలిపారు. అక్కినేని సినీ జీవిత విశేషాలను వివరించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని హనుమంత గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. విద్యావేత్త మధు మోహన కృష్ణ గురించి మాట్లాడుతూ అధ్యాపకునిగా ఆయన వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. మీనాక్షి కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకుడు మధుమోహన్ మాట్లాడుతూ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందజేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు, ఆదిరాల జయప్రభ ప్రసూనా రామన్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

కొండంత అండ జగనన్న ఆరోగ్య సురక్ష



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజల ఆరోగ్యానికి కొండంత భరోసా లభిస్తుందని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా తెలిపారు. జగనన్న ఆరోగ్యశ్రీ సురక్ష కార్యక్రమంపై సింగ్‌నగర్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రజలు జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైరల్ జ్వరాల పట్ల వైద్యాధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమల నియంత్రణకు డివిజన్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా దీనికి సహకరించి స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని కోరారు. అక్టోబర్ 11న సింగ్ నగర్ ఎంకే బేగ్ నగరపాలక సంస్థ పాఠశాలలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా వినాయకచవితి ఉత్సవాలు



అయోధ్యనగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



దావు బుచ్చయ్యకాలనీలో భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద వినాయకచవితి వేడుకల్లో పాల్గొన్న సీహెచ్ శ్రీదేవి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సీహెచ్ శ్రీదేవి అన్నారు. విజయవాడలోని డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగుల సంఘం రీజనల్ అధ్యక్షుడు ఎం. రాజు బాబు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు దైనందిక విధులతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. కుల మతాలకు అతీతంగా సమష్టి గా పండుగలను చేసుకోవడం ఐకమత్యానికి నిదర్శనమన్నారు. గణాధిపతి ఎలాంటి విఘ్నాలు లేకుండా అందరికీ మంచి ఆరోగ్యం ప్రసాదించాలని కోరుకున్నారు. అనంతరం అధికారులు అన్న దానం నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. పురేంద్ర, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ పి.సీతాపతిరావు, ఆర్టీవోలు ఎ. విజయసారథి, ఆర్.ప్రవీణ్, ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం. రాజుబాబు, ఏపీ ఎన్జీఓ నాయకులు యండీ ఇక్బాల్, సీహెచ్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్) అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అయోధ్యనగర్‌లో ఓం శ్రీ శక్తి గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని గణపతికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలతో బంధాలు పటిష్టం అవుతాయని చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ న్యాయవిభాగం రీజనల్ కో ఆర్డినేటర్ ఒగ్గు గవాస్కర్‌తో కలిసి అన్నదానం ప్రారంభించారు. సుమారు రెండు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులు చింత పెద్దిరాజు నిర్వాహకులు కె.బాలాజీ, జి.కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. దావు బుచ్చయ్యకాలనీ మూడో వీధిలో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు శరణ్, ఓనం కృష్ణ, చింతలపూడి రమేష్‌లను అభినందించారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తొలుత వినాయకునికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు రెండు వేల మందికి అన్నదానం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మిలి రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ కొబ్బరితోటలో శుక్రవారం మహిళా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా అన్నదానం జరిగింది. ఇక్కడ 12 సంవత్సరాల క్రితం చిన్నారులు ప్రారంభించిన వినాయక చవితి ఉత్సవాలను వారి తల్లులు కొనసాగిస్తున్నారు. తమ పిల్లలు చదువుల రీత్యా వేరే ప్రాంతాలలో ఉండటంతో తాము చవితి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తల్లులు తెలిపారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు కె.రోజారాణి, రాజీ, కె.అనురాధ, సత్య, గౌరమ్మ తదితరులు పర్యవేక్షించారు.

24న మెగా రక్తదాన శిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఈ నెల 24వ తేదీన మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఏర్పాట్లపై జిల్లా వైద్యాశాఖ అధికారులు శుక్రవారం పరిశీలన చేసి స్థానిక అధికారులతో చర్చించారు. డీఎల్‌ఏటీవో డాక్టర్ ఉషారాణి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి

మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు



దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ గంగరాజు, అతిథులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి ఉందని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. అనంతలక్ష్మి దేవి సేవా సంఘం, శారద విద్యాలయల కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు ఆధ్వర్యంలో నిరుపేదలకు బియ్యం, కూరగాయలు, మహిళలకు చీరల పంపిణీ పాయకాపురంలోని శ్రీశారదా విద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని, ఉన్నదాంట్లోనే లేనివారికి సహాయం చేయాలని సూచించారు. ముందుగా కరాటే శిక్షణలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి గురువులను సన్మానించారు. అనంతరం హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగులకు పౌష్టికాహారం, కూరగాయలు, బియ్యం, 100 మంది పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం నిర్వహించారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అప్పలరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమలు మరిన్ని చేసి పేదలను, అన్నార్తులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త మంతెన రామకృష్ణంరాజు, లైన్స్ క్లబ్ సుప్రీం ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, రామలింగ రాజు గారు సమితి ప్రెసిడెంట్ రాంప్రసాద్, శారద విద్యాలయం తెలుగు, ఇంగ్లిష్ మీడియంల హెచ్ఎంలు శారద,సురేఖ,కరాటే మాస్టర్లు ఎం.కన్య టి.సత్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనాసుల్తానా, మత పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వాంబే కాలనీలోని ఆస్థాన ఏ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమంలో సెప్టెంబర్ 28న నిర్వహించనున్న ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ముస్లిం పెద్దలతో కలసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. రుహుల్లా మాట్లాడుతూ అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ ముస్తఫా సల్లలాహు అలైహి వస్సలం మహాత్ముల వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుంటూ ప్రపంచం మొత్తం ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలను జరుపుకుంటారన్నారు. ఖాజా బాబా ఆశ్రమంలో జరిగే ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హఫీజుల్లా, ఖాజా బాబా ఆశ్రమం కమిటీ సభ్యులు బాషా, జిలాని, గౌస్ ,జాని, బిల్డర్ రమేష్, చింతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు రూ.1.12 లక్షల విరాళం



డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి విరాళం అందజేస్తున్న దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గోశాల నిర్వహణ, అభివృద్ధికి శుక్రవారం దాత పి.కామేశ్వర శర్మ దంపతులు రూ.1.12 లక్షలు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. దాతలు మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న గోశాల నిర్వహణ, అభివృద్ధికి తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామని చెప్పారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ సకల దేవతల స్వరూపమైన గోవుల పరిరక్షణకు తాము గోశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం దాతలకు పూజలు చేయించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, యాదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ధర్నా చౌక్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన జరిగింది. తొలుత ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి కె.సత్యం మాదిగ మాట్లాడుతూ ప్రస్తుత సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అర్బన్ కన్వీనర్ లింగాల నరసింహులుమాదిగ, వై.కోటేశ్వరరావుమాదిగ నాగమల్లేశ్వరరావు, మంద పిచ్చయ్య, గంటేటి సుజాతనాయుడు, కటికల సైదులు, మొండితోక విజయ్ మాదిగ, వంశీ మాదిగ,ఇసుకపల్లి చిట్టిబాబు, రామారావు పాల్గొన్నారు.

ఒగ్గు గవాస్కర్‌కు సత్కారం



గవాస్కర్ అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం రీజనల్ కో ఆర్డినేటర్ (ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలు)గా నియమితులయిన ఒగ్గు గవాస్కర్‌ను శుక్రవారం అయోధ్యనగర్‌లో న్యాయవాదులు సత్కరించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని గవాస్కర్ సేవలను కొనియాడారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం రీజనల్ కోఆర్డినేటర్ ఒగ్గు గవాస్కర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మూడు జిల్లాల కో ఆర్డినేటర్‌గా అవకాశం కల్పించటం ఆనందంగా ఉందన్నారు. అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని గవాస్కర్‌ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక



ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక విజయవాడలో శుక్రవారం జరిగింది. నగరంలో ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.వీ రారెడ్డి, సీనియర్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా బి.సురేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ యదిద్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.సాంబశివరావు, డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.రవికుమార్, జాయింట్ సెక్రటరీ సుబ్బారావు, శిరీష, ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎస్.వెంకట్, ఎ.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, రాయలసీమ ఇన్‌చార్జిగా ఈ బాలగౌడ్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులను చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అభినందించారు. అలాగే వచ్చే ఆరు నెలలో రాష్ట్రంలో 24 ట్రైనింగ్ క్యాంప్స్, 3 అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులు, 3 రాష్ట్ర స్థాయి బిజినెస్ ఎగ్జిబిషన్స్, 3 ఇండస్ట్రియల్ టూర్స్, 3 ఇంక్యూబేషన్ సెంటర్స్‌లను ఐఐటీ కాన్పూర్ సహకారంతో చేయటానికి కార్యాచరణ రూపొందించారు. నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ 26 జిల్లాలలో పారిశ్రామిక అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ కమిటీ వివరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత అధికార విభాగాలకు పంపిస్తామని తెలిపారు.

హాస్టల్స్‌లో విద్యా ప్రమాణాలు పెంచాలి

జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.విజయభారతి



సమావేశంలో పాల్గొన్న వసతి గృహాల సంక్షేమ అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎం. విజయభారతి అన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో సంక్షేమ వసతి గృహాల సహాయ సంక్షేమ అధికారులు, సంక్షేమ అధికారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. 100 శాతం బయోమెట్రిక్ హాజరు తప్పక ఉండాలని తెలిపారు. కచ్చితంగా మెనూ అమలు చేయాలని సూచించారు. వసతిగృహాల సిబ్బంది వారికి కేటాయించిన సమయాలలో తప్పక హాజరు కావాలని, హెడ్ క్వార్టర్ లో నివాసం ఉండాలని ఆదేశించారు. అన్ని రికార్డులు తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. పది, ఇంటర్ విద్యార్థుల చదువు, ఉత్తీర్ణత విషయములో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హాస్టల్స్‌లో కిచెన్ గార్డెన్ ను తప్పకుండా ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

రసరమ్య కావ్యం రామాయణం



సుందరాకాండ కథాగానం చేస్తున్న పద్మనాభశర్మ

విజయవాడ కల్చరల్: రసరమ్య కావ్యం రామాయణమని ప్రఖ్యాత హరికథా భాగవతార్ బుర్రా పద్మనాభశర్మ అన్నారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణ పురంలోని సీతారామా కల్యాణ మండపంలో శుక్రవారం సుందరాకాండ అంశంగా కథా గానం చేశారు. వాల్మీకీ రామాయణం నిత్యనూతనమన్నారు. మూర్తీభవించిన ధర్మానికి ప్రతి రూపం రామచంద్రుడుని తెలిపారు. సీతాన్వేషణ సమయంలో హనుమంతుని కార్యదక్షత, ధర్మనిష్ఠ అంశాలు మనకు కనిపిస్తాయని చెప్పారు. రామాయణలోని సుందరాకాండ పఠనం వల్ల సర్వశుభాలు కలుగుతాయన్నారు. సుధాకర్, దక్షిణా మూర్తి వాద్య సహకారం అందించారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఊటుకూరి పార్థసారథి, కార్యదర్శి దశరథ రమేష్, కోశాధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బందరుకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సూర్యారావుపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పున్నమ్మతోట సమీపంలోని బందరు కాలువలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం నీళ్లలో తెలియాడుతు ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 45–50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, వంటిపై వంకాయరంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బ్లూ కలర్ గళ్ల కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని పరిస్థితిలో ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాల్సిందిగా వారు తెలిపారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్ను, వాటర్ మీటర్ పన్నులను మొదటి అర్ధ సంవత్సరం ముగుస్తున్నందున పన్నులు చెల్లించేందుకు వీఎంసీ ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేసిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల సౌకర్యార్థం వీఎంసీ మూడు సర్కిళ్ల పరిధిలో ఆయా క్యాష్ కౌంటర్లు సెలవు దినాల్లోనూ పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ నెలలో 24న ఆదివారం, 28న మిలాదున్ నబి రోజున కూడా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని అన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజయగణపతికి గంధంతో అర్చన



అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



గంధంతో అలంకరించిన విజయ గణపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన విజయ గణపతికి గంధంతో అర్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విజయగణపతిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.